బాధితుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

చిరస్మరణీయుడు సుందరయ్య

• ఆయన ఆశయ సాధనకు కృషి • ప్రభుత్వ విధానాలపై పోరాడాలి
• సుందరయ్య వర్ధంతి సభలో సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సమ సమాజ స్థాపనకు పాటుపడిన చిరస్మరణీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ అన్నారు. సోమవారం ఇందిరా గాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో న్యాసిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడారు. సుందరయ్య చిన్నతనం నుండే ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నట్లు చెప్పారు. 15ఏళ్ళ వయసుకే ఉప్పు సత్యాగ్రహం పోరాటంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన త్యాగశీలి అని కొనియాడారు. పెట్టుకున్న లక్ష్యాన్ని ఆదర్శవంతమైన జీవితం గడిపాడని

సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు గఫూర్

చెప్పారు .ప్రతి నాయకుడికి వ్యక్తిగత జీవితంలో ప్రసంగాల కన్నా ఆచరణ ముఖ్యం అని సూచించారు. సమాజమే నా పిల్లలు అని ఆలోచించిన సుందరయ్య తమకు పిల్లలు కలగకుండా త్యాగం చేశాడని అన్నారు. తుదిశ్వాస వరకు సమసమాజ స్థాపన ఏర్పాటుకు పాటుపడినట్లు చెప్పారు. బిజెపి ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తోందన్నారు. ప్రస్తుత సమాజంలో రాజకీయాలను ఉపయోగించు కొని ప్రజాకణాన్ని గొల్ల కొట్టడం పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రధాని ఖజానాతో ఓట్ల సమయంలో డబ్బులతో ఓట్లు కొని అధికారం చేయబడుతున్నారని దుయ్యబట్టారు. ముస్లింలను శత్రువులుగా చూస్తున్నారని, ప్రజల్లో ఐక్యతను దెబ్బ తీస్తున్నారన్నారు. ప్రజలను చైతన్యం చేసి, ప్రజలను ఐక్యం చేసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాల సిద్ధం కావాలని కోరారు. సుందరయ్య ఆశయాలు సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

విప్లవ గీతాలు ఆలపిస్తున్న పిఎన్ఎం కళాకారులు

సుందరయ్య జీవితం ఆదర్శనీయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సుందరయ్య జీవితం ఆదర్శనీయం అన్నారు. 13 ఏళ్ళ వయసు నుండి తుది శ్వాస వరకు ప్రజల కోసం పాటుపడిన నాయకుడు అని కొనియాడారు. పార్లమెంట్‌లో సభ్యులు అందరు సుందరయ్య ప్రసంగం కోసం ఎదురుచూసిన పరిస్థితి నాడు ఉండేదన్నారు. నేడు బిజెపి ప్రభుత్వం భారతదేశ సమైక్యతను దెబ్బతీస్తూ మతం వైపు తీసుకు వెళుతున్నారు. కార్పొరేట్‌లకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తుందన్నారు. వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి హిందూ దేశంగా మార్చాలని చూస్తున్నారన్నారు. ప్రశ్నించే వారిని జైల్లో పెడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి నాయకుడు ప్రజలలో ఉంటూ వారి శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. అప్పుడే సుందరయ్య ఆశించిన లక్ష్యం నెరవేరుతుందన్నారు.

ప్రాజెక్టుల కోసం మరో పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ సిపిఎం అఖిలభారత మహాసభలలో తీసుకున్న నిర్ణయాలను ఆచరణలో తీసుకురావాలని అన్నారు. కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం మరో పోరాటం చేసే సాధించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో ఉపయోగించుకొని లౌకిక భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. స్మార్ట్ మీటర్లు పన్నుల భారాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని సూచించారు. బిజెపికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడం ద్వారానే సుందరయ్యకు ఘనమైన నివాళి అర్పించినట్లున్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల మాట్లాడుతూ మహిళలపై హింసతో పాటు అత్యాచారాలు జరుగుతున్నాయని చెప్పారు. వాటిని అరికట్టడం లేదన్నారు. సుందరయ్య భార్య నీలమ్మ కూడా ఆయనకు వెన్నుదన్నుగా ఉందన్నారు. అందరూ భారతీయులైనన్న భావనను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు.

ఆకట్టుకున్న గేయాలు, నృత్యరూపకాలు : సభకు ముందుగా ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో కళాకారులు ఆలపించిన గేయాలు అమర జీవి సుందరయ్య, వీరులారా... సూరులారా, జోహార్ జోహార్ సుంద రయ్య, నీలాంటి త్యాగధనులు, ఆశయాల బాటల్లో ఎన్నో వసంతాలు, ప్రదర్శించిన నృత్య రూపకాలు రెడ్ సెల్యూట్, విప్లవ నేత సుందరయ్య కు పోరు దండాలు వంటి పాటలు నృత్య రూపకాలు ప్రజలను ఆకార్షించాయి. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవి.నారాయణ, ఎండి ఆనంద్ బాబు, నాయకులు హుసేనయ్య, కృష్ణ, నాగన్న పాల్గొన్నారు.

విచారణ చేపట్టి న్యాయం చేస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- టూ టౌన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించారు. ఫిర్యాది దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 128 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, లీగల్ అడ్వయిజర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

అర్జీలను కనీసం పరిశీలించలేరా..?

• అధికారుల తీరుపై కలెక్టర్ అసహనం
• బాధితుల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పది రోజులైనా కనీసం పరిశీలన చేయలేరా అని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని చెప్పినప్పటికీ కొన్ని శాఖల అధికారులు వారం, 10 రోజులైనా చూడడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కర్నూలు అర్బన్ సిడిపిఒ, ఆదోని మున్సిపల్ కమిషనర్, కర్నూలు అర్బన్ తహశీల్దార్, డిప్యూటీ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ శాఖలకు సంబంధించి వారం నుంచి పది రోజులైనా అర్జీలను చూడలేదని తెలిపారు. అర్జీలను చూడకుంటే ఎలా అని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. ప్రజల అర్జీలకు సంబంధించి నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని తెలిపారు. రీసర్వే గ్రామ సభలకు సంబంధించి రీ ఓపెన్ అయిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సర్వే శాఖ అధికారిని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల అర్జీలను కూడా త్వరగా పరిష్కరించాలని తెలిపారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనురాధ పాల్గొన్నారు.

పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం నూతన పల్లె గ్రామంలో రైతుల 340సి రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతుల పంట పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. రైతులు రోడ్డు దాటి అవతలికి పోవడానికి అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించి రైతులకు సౌకర్యం కల్పించాలని కలెక్టర్ రంజిత్ బాషాను కోరారు. సోమవారం కలెక్టర్‌ను రామకృష్ణ, రైతుసంఘం జిల్లా నాయకులు జి.ఆంజనేయులు, నూతన పల్లె గ్రామ రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన పల్లె నుంచి హైవేకు వెళ్లడానికి రోడ్డు ఎత్తుగా ఉండడం వల్ల హైవేకు రైతులు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. హైవే రోడ్డు ఎక్కడానికి అనుకూలంగా రోడ్డు వేయాలని కోరారు. రోడ్డు నుంచి అవతలికి పోవడానికి అండర్ బ్రిడ్జి వేసినప్పటికీ రోడ్డు సౌకర్యం లేక రైతులు పొలాలకు వెళ్లలేకపోతున్నారన్నారు. హైవే రోడ్డుకు అవతల పక్కన 300 ఎకరాలకు పైగా సన్న, చిన్న కారు రైతుల భూములు ఉన్నట్లు తెలిపారు. అత్యధిక భూముల్లో బోరు, బావులు ఉన్నట్లు చెప్పారు. కూరగాయలు, ఆకుకూరలు, రకరకాల పంటలు రెండు కార్లు పంటలు పండిస్తారని తెలిపారు. అటువంటి భూములకు వెళ్లడానికి వీలు లేకుండా ఉందని చెప్పారు. రోడ్డు దగ్గర విద్యుత్ తీగలు కిందికి వేలాడటం వల్ల రోడ్డు దాటడం కష్టంగా ఉన్నట్లు తెలిపారు. విద్యుత్ తీగలు అడ్డంగా ఉన్నాయని, రోడ్డు సక్రమంగా లేదని చెప్పారు. ఫలితంగా రోడ్డు అవతల భూములు సాగు చేయడానికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే హైవే రోడ్డుకు భూములు త్యాగం చేసిన రైతులు సొంత భూములకు పోవడానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ... నూతన పల్లె గ్రామ రైతులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని నేషనల్ హైవే పీడీని ఆదేశించారు. అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించి ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను ఆదేశించారు. రైతులు శ్రీనివాసులు, కృష్ణయ్య, ఖాజా, నజీర్, ఆంజనేయులు, త్రినేత్ర రాముడు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ, రైతులు

కోడుమూరు మండలం కొత్తూరులో సంచార వైద్యం చేస్తున్న వైద్యులు

కొత్తూరులో సంచార చికిత్స

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కొత్తూరు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యమాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు పరిశీలించారు. అనంతరం గర్భశయ ముఖద్వారా క్యాన్సర్ గురించి అవగాహనా కల్పించారు. యోని నుండి అసాధారణ రక్తస్రావం లేదా దుర్వాసనతో కూడిన తెల్లబట్ట, లైంగిక చర్యలో పాల్గొన్న సమయంలో నొప్పి పాల్గొన్న తర్వాత రక్తస్రావం ఉన్నట్లుండి బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. చిన్న వయసులో గర్భం దాల్చుటా, ఎక్కువసార్లు గర్భం దాల్చటం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, సురక్షితం కానీ లైంగిక పద్ధతులు అవలభించడం బహుళ లైంగిక సంబంధాలు కలిగి ఉండటం వలన క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ముందస్తు పరీక్షలు చేయడానికి ఇంటివద్దకు వచ్చిన ఆరోగ్య కార్యకర్తలకు సహకరించాలని కోరారు. వైద్యులు డాక్టర్ అఫాన్ మొహమ్మద్, వెంకటేశ్వరమ్మ సచివాలయ ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త కుమారి, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలంలోని కంభదహాల్ రోడ్డులో హెడ్ కానిస్టేబుల్ ఆచారి, సిబ్బంది సుదర్శనం, శ్రీనివాస గౌడ్ లు సోమవారం డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడే మద్యం తాగుతూ వాహనాలు నడుపున్న డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లోనూ, వాహనాలు నడుపుతూ డ్రైవింగ్ చేసినా ఇతరులకు ఇబ్బంది కలిగించినా చర్యలు తప్పవన్నారు. మద్యంతాగి వాహనాలను నడిపితే ఎక్కువగా ప్రమాదాలు అయ్యే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యం కూడా పాడవుతుందని సూచించారు.

పనులను సకాలంలో పూర్తి చేయండి

గుత్తేదారుల సమావేశంలో మంత్రి టిజి. భరత్
సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : నగరంలో నగరపాలక అభివద్ధి పనులను టెండర్ ద్వారా దక్కించుకున్న గుత్తేదారులు పనులను జాప్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మంత్రి, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గుత్తేదారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా గుత్తేదారుల వారీగా చేపట్టిన పనుల పురోగతిపై ఆరా తీశారు. మంత్రి భరత్ మాట్లాడుతూ.. టెండర్ వేసి పనులు దక్కించుకుని పనులు ప్రారంభించకపోవడం ఎంత మాత్రం సబబు కాదని, జాప్యం చేయడం వల్ల ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు వస్తుందని చెప్పారు. ప్రభుత్వం బిల్లుల చెల్లింపు ప్రక్రియ సులభ తరం చేస్తోందని, సిఎఫ్ఎంఎస్ ప్రక్రియలో మున్సిపల్ బిల్లుల విషయమై నూతన విధానాన్ని తీసుకొస్తుందని వెల్లడించారు. గుత్తేదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ నెలాఖరులోగా నగరంలో అన్ని పనులను ప్రారంభించాలని సూచించారు. పనులు సకాలంలో పూర్తి కాకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, పనులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకోరావాలని మంత్రి సూచించారు. ఇంచార్జ్ ఎస్ఇ శేషసాయి, ఎంఇ సత్యనారాయణ, డిఇఇలు, ఎఇలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి. భరత్

సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపి సమగ్ర అభివృద్ధి కోసం కృషిచేసిన మహనీయుడు సుందరయ్య బాటలో పయనిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయి సూచించారు. కర్నూలు నగరం ఇందిరా గాంధీనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సుందరయ్య 40వ వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. సుందరయ్య విగ్రహానికి పూల మాల వేసి ఘననివాళ్లు అర్పించారు. సభలో జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, టి.రాముడు, ఆనంద్‌బాబు మాట్లాడారు. సుందరయ్య జీవితం చాలా ఆదర్శనీయమన్నారు. చిరుప్రాయంలోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొని, తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరి,తుది శ్వాస వరకు ఎర్ర జెండా చేతబట్టిన మహనీయుడు సుంద రయ్య అన్నారు. అంటరానితనం రూపుమాపాలని తన ఇంటి నుండి మొదలు కావాలని ఇంట్లో వారిని గురించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయించారన్నారు. దక్షిణ భారతదేశంలో పార్టీ నిర్మాణం కోసం, సమాజిక సేవాకార్యక్రమాలు, ప్రజాప్రతినిధిగా అభివృద్ధికి, నియమ నిబంధనలకు పాటించడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. పార్టీ జిల్లా నాయకులు ఎం. రాజశేఖర్, గురుశేఖర్, నరసింహులు, సాయిబాబా, భాస్కర్, రాఘవేంద్ర, ప్రజా నాట్యమండలి కళాకారులు రాజు, లోకేష్, నోమేశ్వరి, బతుకన్న, కిట్టు తదితరులు అభ్యుదయ గేయాలను ఆలపించారు.



ఉపాధికూలీల సమక్షంలో ఓర్వకల్లు కార్యదర్శి నాగన్న నివాళి

కర్నూలు కార్పొరేషన్: మహానేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు పాటుపడాలని సిపిఎం జిల్లా కార్యవర్గ దర్శి వర్గ సభ్యులు పి.ఎస్ రాధాకృష్ణ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు అర్బన్,32వ వార్డ్,సుందరయ్య నగర్ సిపిఎం కార్యాలయంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప ఆధ్వర్యంలో సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ సుందరయ్య సేవలను కొనియాడారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.హుస్సేన్‌బాషా సుందరయ్య నగర్ కార్యదర్శి ఇ.రామాంజనేయులు, ఎం.దావీదు,తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : దక్షిణ భారతదేశ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కోడుమూరు సుందరయ్య భవన్‌లో సిపిఎం మండల కార్యదర్శి కె.రాజా అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం మండల నాయకులు గఫూర్‌మియ్యా, కార్యదర్శి కె. రాజు మాట్లాడారు. సుందరయ్య జీవిత విశేషాలు, ఆయన సమాజానికి , మార్కిస్టు పార్టీ నిర్మాణానికి చేసిన కృషివివరించారు.

గూడూరు: సుందరయ్య చిత్రపటానికి సిపిఎం గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్ నాయకత్వంలో సుందరయ్యకు ఘనంగా నివాళ్లు అర్పించారు.

కర్నూలు క్రైమ్: పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని సిపిఎం కర్నూలు మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ. తాండ్రపాడు, గొందిపర్ల గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి పిబి.హుస్సేనయ్య గ్రామ సర్పంచి బాలపీరా, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు రేణుకమ్మ, శ్రీరాములు ఆంజనేయులు వెంకటేశ్వర్లు చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న జె.మోహన్ తదితరులు

అభివాదం చేస్తున్న ఐక్య ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం

ఐక్య ఉపాధ్యాయ సంఘాల నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ స్పందించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఐక్య ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొన్నారు. ఈనెల 21న డిఇఒ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున ఉమ్మడి కర్నూలు జిల్లా ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం సాయంత్రం కర్నూలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఐక్య ఉపాధ్యాయ సంఘాల కార్యాచరణ సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్,నవీన్‌పాటి ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం, పిఆర్‌టియు నాయకులు బాబురావు, దాదామియా, ఎస్‌టియు నాయకులు గోవిందు, సురేష్, ఆపాస్, నాయకులు నాగిరెడ్డి నాయక్, యుటిఎఫ్ జిల్లా సహా ధ్యక్షుడు హేమంత్, జిల్లా కార్యదర్శిలు దుర్గాప్రసాద్, ఇబ్రహీం మండలా ల నాయకులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం యధావిధిగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను నాశనం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీల పదోన్నతులపై విద్యాశాఖ తీసుకున్న చర్యలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. అందుకే రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ వైఖరిని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమబాటపడుతున్నాయన్నారు. 21న జరిగే ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడి చేపట్టామన్నారు.

మెగా డిఎస్‌సి ఘనత చంద్రబాబుదే

-వైసిపి ఐదేళ్లలో టీచర్ పోస్టులు భర్తీ చేయలేదు -ఎం.పి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్



మాట్లాడుతున్న ఎంపి బస్తిపాటి నాగరాజు

రాష్ట్రంలో మెగా డిఎస్‌సి ద్వారా 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు కలిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఖ్యాతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిఎస్‌సి అభ్యర్థులకు నెల రోజుల పాటు కలిపిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఎంపి ఉచిత శిక్షణ తరగతుల పై నిర్వాహకులు, అభ్యర్థులతో చర్చించి, అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ బుక్కులను అందజేశారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చాక మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు..వైసిపి ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఇవ్వలేదని విమర్శించారు.. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి, ఉచిత శిక్షణ ట్రైనర్ కళ్యాణ్ కుమార్, డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ రవిశంకర్ రెడ్డి

హత్య కేసులో మరో ఐదుగురు అరెస్టు

- సిఐ రవిశంకర్ రెడ్డి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని అమృతాపురం గ్రామం వెంకటేష్ హత్య కేసులో మరో ఐదుగురిని అరెస్టు చేసినట్లు సిఐ రవి శంకర్ రెడ్డి తెలిపారు. సోమవారం హాలహర్వి పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతనెల 25న కంటిసేని పెద్ద వెంకటేష్ హత్యకు గురయ్యారని తెలిపారు. అదే గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు సోమన్న, పెద్ద వెంకటేష్ బంధువులని, మృతుడు పెద్ద వెంకటేష్ వడ్డీలకు డబ్బులు ఇచ్చేవారని చెప్పారు. ఈ క్రమంలో సోమన్న కూడా వడ్డీకి డబ్బులు తీసుకొని ప్రామిసరీ నోటు రాయించుకున్నారని తెలిపారు. సోమన్న కొంత డబ్బు తిరిగి కట్టినా దానికి సంబంధించిన ప్రామిసరీ నోటు తిరిగి ఇవ్వకుండా ఇంకా డబ్బు లేదని కోర్టులో కేసు వేశారని చెప్పారు. రెండు కుటుంబాల మధ్య గొడవలు ఉన్నాయని, వీటి కారణంగా సోమన్న ఊరు వదిలి అనంతపురం జిల్లా సెట్టూరుకు పోయి అక్కడే పొలం కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మృతుడు పెద్ద వెంకటేష్ సోమన్నను వదలకుండా డబ్బులు కట్టమని అడుగుతూ సోమన్న పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. సోమన్న తనకు జరిగిన అన్యాయానికి పగ తీర్చుకోవాలని, పెద్ద వెంకటేష్‌ను చంపాలని అనుకున్నట్లు తెలిపారు. సహాయంగా ఉండాలని అడిగినందుకు అదే గ్రామానికి చెందిన నిందితుడు నటరాజ్ గౌడ్ ద్వారా హోళగొంద గ్రామస్తుడు చాకలి నాగరాజు, ఉత్తనూర్ గ్రామానికి చెందిన బొకలప్పను రూ.2 లక్షల ఒప్పందం చేసుకొని ధనుంజయ, అమ్మ తాపురంకు చెందిన హరిజన ఈరన్న సహాయంతో వెంకటేష్‌ను హతమార్చారని వివరించారు. ఎస్ఐ చంద్ర, కానిస్టేబుళ్లు వీరారెడ్డి, గోవర్ధన్, అయ్యస్వామి పాల్గొన్నారు.

ఉద్ధృతంగా వేదవతి

మార్లమడికి వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వేదవతి

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని మార్లమడికి గ్రామం వద్ద ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో వేదవతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదికి వరద నీరు పోటెత్తడంతో గంట గంటకు నీటి మట్టం పెరుగుతోందని గ్రామస్తులు సోమవారం తెలిపారు. అనంతపురం, రాయదుర్గంతో పాటు కర్ణాటకలోని శివమొగ్గ, సాగర్‌లోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వేదవతి నదికి వరద నీరు భారీగా చేరుతోంది. వరద నీటి ఉధృతి ఇలాగే కొనసాగితే ఆంధ్ర, కర్ణాటకకు రాకపోకలు సాగించేందుకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఘనంగా తిక్కలక్ష్మమ్మ అవ్వ ప్రభోత్సవం

ప్రజాశక్తి - నందవరం

కనకవీడు గ్రామంలో వెలసిన శ్రీతిక్కలక్ష్మమ్మ అవ్వ ప్రభోత్సవ జాతర సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి కుంకుమార్చన, దీప దూప నైవేద్యాలతో, మేళతాళాలు, భాజా భజంత్రీలతో ప్రభోత్సవ జాతర సాగింది. ప్రతేడాది అమ్మవారి జాతరను గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కెఆర్.లక్ష్మి కాంత్ రెడ్డి, కె.రఘుమూర్తి స్వామి, నందవరం వైస్ ఎంపిపి నడిపి షేక్ సాబ్, సర్పంచి మద్దేశ్వరి, ఎంపిటిసి సావిత్రమ్మ, గ్రామ పెద్దల సమక్షంలో జాతర ప్రశాంతంగా సాగింది. బ్రహ్మంగారి జీవిత చరిత్ర రెండు నాటకాలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం దగ్గర అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆధిపత్య పోరుతో నీటి ఎద్దడి

- ఇష్టానుసారంగా కుళాయిలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సమస్యను పరిష్కరించడంలో అధికారులు, పాలకుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో కొంతమంది నాయకుల ఆధిపత్య పోరుతో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. ఇష్టానుసారంగా కుళాయిలు వేయించారు. నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి ఎద్దడిని నివారించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

గ్రామంలో కొంతమంది నాయకులు ఆధిపత్యం కోసం కుళాయిలను తమ కార్యకర్తలకు, అనుకూల వ్యక్తులకు ఇష్టానుసారంగా పోటీ పడి వేయించారు. గ్రామంలోకి నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు ఇష్టానుసారంగా, పంచాయతీ అనుమతి లేకుండా ఎవరు పడితే వారు బొక్కలు వేసుకుని కుళాయిలు వేసుకున్నారు. గ్రామంలో సుమారు 300 కుళాయిలు వేసినట్లు సమాచారం. ఇలా వేసుకోవడం వల్ల గ్రామంలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. నాయకులు తమ ఆధిపత్యం కోసం గ్రామంలో ఎప్పుడూ లేనివిధంగా నీటి ఎద్దడిని సృష్టించడానికి కారణమయ్యారని ప్రజలు వాపోతున్నారు. కోట వీధిలో నీరు సరిగా రాక 18 కుటుంబాలు నీటి దాహంతో ఇబ్బంది పడుతున్నాయి. గత 13 సంవత్సరాలుగా కోట వీధిలో నీటి సమస్య ఉండేది కాదు. ప్రస్తుతం నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు కుళాయిలు వచ్చిన వెంటనే చాలామంది వ్యక్తులు కుళాయిలకు మోటార్లను వేసుకుంటున్నారని, దీని వల్ల వచ్చే కొద్దిపాటి నీరు కూడా రావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామంలో నెలకొన్న ఈ దుర్భర స్థితిపై జిల్లా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీటి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

సమస్య పరిష్కారంలో అధికారులు, పాలకుల నిర్లక్ష్యం

నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరించి అమాయక ప్రజలను నీటి ఇబ్బందులకు గురి చేస్తున్నా పాలకులు, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామంలో నీటి వ్యవస్థ ఇంత దుర్భరంగా తయారైనా దానిపై అధికారులు స్పందించడం లేదు. కొత్త కుళాయిలు వేసిన రోజున పాలకులు, అధికారులు చాలా హడావిడి చేస్తారు. వారి దగ్గరికి వెళ్తే తూతూమంత్రంగా నోటీసులు ఇవ్వడం వస్తారు. గ్రామంలో ఇప్పటివరకు చాలా మందికి నోటీసులు ఇచ్చారు. ఒక్కరిపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అధికారులను వివరణ కోరగా... అండర్ గ్రౌండ్ ద్వారా పైపులైన్ వేసి గ్రామానికి నీటిని సరఫరా చేయాలనుకుంటున్నాం. ఆ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. ఇప్పుడున్న సమస్యపై కాలయాపన జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న నీటి సమస్యపై దృష్టి సారిస్తాం.

అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి

- చాకలి సావిత్రి, నందవరం

18 కుటుంబాలకు కలిపి ఒక్క కుళాయి మాత్రమే ఉంది. గత 13 సంవత్సరాలుగా ఈ కుళాయి ద్వారా మాకు అవసరమైన నీరు పుష్కలంగా వచ్చేవి. ప్రస్తుతం మూడు రోజులకు ఒకసారి కుళాయికి నీరు వస్తోంది. అది కూడా నాలుగు బిందెలు కూడా రావడం లేదు. మా కుటుంబాలు కోట వీధిలో ఎత్తులో ఉన్నాయి. మేము వేరే కుళాయికి వెళ్లాలంటే 20 మెట్లు ఎక్కి దిగాల్సి ఉంటుంది. మెట్లు ఎక్కి దిగలేని వృద్ధులు నానా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి మా కుళాయికి నీరు వచ్చేలా చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

ఘనంగా లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

శ్రీమహాయోగి తిక్క లక్ష్మమ్మ అవ్వ 93వ వెండి రథోత్సవం వేలాది మంది భక్తుల సందోహం నడుమ సోమవారం అట్టహాసంగా సాగింది. ఉదయం నుంచి శ్రీలక్ష్మమ్మ అవ్వ మూల విరాట్‌కు బంగారు కిరీటం ధరింపజేసి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. కాయ, కర్పూరం, కుంకుమార్చన, పూలు, నైవేద్యం సమర్పించారు. పట్టణంలో సేవా దాతలు అల్పాహారం, పండ్ల రసం, మజ్జిగ, తాగునీరు, అన్నదానం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ హేమలత, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, మీనాక్షి నాయుడు, జనసేన పార్టీ నాయకులు మల్లప్ప, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి శ్రీలక్ష్మమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త రాయచోటి రామయ్య, సుబ్బయ్య శెట్టి ఆలయానికి వచ్చిన అతిథులకు, ప్రముఖులకు సన్మానం చేశారు. శ్రీలక్ష్మమ్మను దర్శించుకునేందుకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డీఎస్పీ హేమలత సమక్షంలో ముందస్తు జాగ్రత్తలతో పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు

ప్రత్యేక అలంకరణలో లక్ష్మమ్మ అవ్వ

రైతుసేవా కేంద్రాల్లో జొన్న కొనుగోలు : జెసి నవ్య

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రైతు సేవా కేంద్రాల ద్వారా నాణ్యమైన జొన్నలు బియర్డ్, జొన్న కనీస మద్దతు ధరపై కొనుగోలు చేస్తున్నట్లు జెసి డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. సోమవారం ఆదోని మండలం బసాపురం గ్రామంలో రైతు సేవా కేంద్రంలో జొన్న రైతులతో జొన్న కొనుగోలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదోని మండలంలో బసాపురం, పెద్దహరివాణం, చిన్నగోనెహాలు, సంతేకుడ్లూరు గ్రామంలో 68 మంది జొన్న రైతులను గుర్తించి, సుమారు రూ.2 వేల క్వింటాళ్లకు అనుమతి మంజూరు చేశామని తెలిపారు. జొన్న ప్రభుత్వం నాణ్యత పరిమాణాలను పరిశీలిస్తుందని చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో రైతుల నుంచి 2024-25 సీజన్‌లో నాణ్యమైన జొన్నలు బియర్డ్ టైప్ కనీస మద్దతు ధర రూ.3,371 కొనుగోలు చేస్తామని తెలిపారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహశీల్దార్ శివ రాముడు, వ్యవసాయ శాఖ అధికారి బాలవర్ధి రాజు, ఆదోని ఎఒ అశోక్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గోడౌన్ పాయింట్ తనిఖీ

ఆదోని పౌరసరఫరాల గోడౌన్ పాయింట్‌ను జెసి బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జెసి మాట్లాడుతూ... బియ్యం కార్డుదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. తహశీల్దార్ శివరాముడు, డిప్యూటీ తహశీల్దార్ రవీంద్రరెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ వలీ బాష పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జెసి నవ్య

ఛైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఛైర్మన్‌గా 42వ వార్డు కౌన్సిలర్ సిహెచ్.లోకేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోవారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ సజావుగా సాగింది. ఎన్నికల అబ్జర్వర్‌గా జెసి డాక్టర్ బి.నవ్య, ప్రీసైడింగ్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ అధ్యక్షతన ప్రక్రియ సాగింది. ఆదోని మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. కౌన్సిల్ సభ్యుల సమక్షంలో 42వ వార్డు కౌన్సిలర్ సిహెచ్.లోకేశ్వరి ఒక్కరే ఛైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. 36వ వార్డు కౌన్సిలర్ సందీప్ రెడ్డి ఆమె పేరును ప్రతిపాదించగా 40వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ బలపరిచారు. సిహెచ్.లోకేశ్వరి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమయింది. ఛైర్మన్‌గా సిహెచ్.లోకేశ్వరిని అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికకు టిడిపి కౌన్సిలర్ పార్వతితో కలిపి 35 మంది వార్డు కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. ఛైర్మన్ ఎన్నికకు కోరం కన్నా ఎక్కువ మంది సభ్యుల మద్దతు ఉండడంతో ఛైర్మన్ నియామక ప్రక్రియ ముగిసింది. అనంతరం ఛైర్మన్ నియామక పత్రాన్ని ప్రెసిడింగ్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎన్నికల అబ్జర్వర్ జెసి నవ్య చేతుల మీదుగా లోకేశ్వరికి అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఛైర్మన్ లోకేశ్వరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

నియామక పత్రం అందుకుంటున్న లోకేశ్వరి

ఆదోనిని అభివృద్ధి చేస్తాం

ఎంతో నమ్మకంతో ఛైర్మన్‌గా ఎన్నుకున్న కౌన్సిలర్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఆదోని అభివృద్ధికి బాటలు వేస్తామని మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్.లోకేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. తాగు నీటి ఎద్దడి రాకుండా, పారిశుధ్య సమస్య తలెత్తకుండా అధికారులతో సంప్రదించి సమన్వయంతో పని చేస్తామన్నారు. ఇప్పటి నుంచి పాలనపరంగా మార్పు ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోవడంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో అందించిన పాలన పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. రాబోయే కాలం వైసిపిదేనని తెలిపారు. ఎన్నికకు సహకరించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్, కౌన్సిలర్లకు ఛైర్మన్ లోకేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.

ఛైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కౌన్సిలర్లు

బిజెపి ఎత్తులను చిత్తు చేశాం

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వ్యవహారంలో బిజెపి నాయకులు ఎన్నో జిమ్మిక్కులు పన్నారని, వాటిని ఐక్యంగా చిత్తు చేశామని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి తెలిపారు. ఛైర్మన్ నియామకం అనంతరం వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆశీస్సులతో ఛైర్మన్ అయిన బోయ శాంత తమను ఇబ్బంది పెట్టారని తెలిపారు. వీటిని భరించలేకనే అవిశ్వాసం పెట్టి దించేశామన్నారు. ఛైర్మన్ భర్త నాగరాజు, కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, ఉస్మాన్, అశోక్, చలపతి, వసీం, బాలాజీ, రఘునాథ్ రెడ్డి, లక్ష్మీదేవి, కీర్తన, లక్ష్మి, భారతి, శాంతి, నాగరత్నమ్మ, ఇంతియాజ్, టిడిపి కౌన్సిలర్ పార్వతి ఉన్నారు.

ఆదర్శ నేత సుందరయ్య

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు
- ఘనంగా సుందరయ్య వర్ధంతి

ప్రజాశక్తి - కౌతాళం

ఆదర్శ నేత, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు తెలిపారు. సోమవారం కౌతాళంలోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు నివాళు లర్పించారు. నాయకులు పులిగయ్య, వలీ, వీరేష్ పాల్గొన్నారు. **దేవనకొండ**లోని సిఐటియు కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం దేవనకొండలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు పెదరాయుడు అధ్యక్షత వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ మాట్లాడారు. దేశ ప్రజలే తన పిల్లలుగా భావించి సమసమాజ స్థాపనకు, ప్రజలందరికీ ఉపాధి, విద్య, వైద్యం కోసం కృషి చేసిన మహా నాయకుడు సుందరయ్య అని పేర్కొన్నారు. ప్రజాసంఘాల నాయకులు రంగన్న, నాగరాజు, రాముడు, రాజు, మహేష్, కాంతయ్య, శేఖర్, రామాంజనేయులు, రాము, రంగడు, బండ్లయ్య, మహబూబ్ బాషా పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, మండల కార్యదర్శి పి.గోవిందు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రాముడు, లక్ష్మీ నరసయ్య, రమేష్, సురేష్, కృష్ణ, గోవర్ధనమ్మ, ప్రజా సంఘాల నాయకులు శివలక్ష్మి, అబ్దుల్లా, లక్ష్మన్న, మోహిన్, ఎన్.రాముడు, సుభాన్, వలీ, రాజు, రాజా రమేష్, శ్రామిక మహిళా సంఘం నీరజ, లత, రాణి, బండా లత, సుజాత, మంజుల పాల్గొన్నారు. **ఆలూరు** జ్యోతిబసు భవన్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా అధ్యక్షత వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, ఈశ్వర్ గౌడ్, షాకీర్, కృష్ణ, ఈరన్న, విఠల్, గోడౌన్ నాగరాజు, గోవర్ధన్, గౌసియాబీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. **ఆదోని**లోని సిపిఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.గోపాల్ అధ్యక్షత వహించారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మణ్, లింగన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కన్న, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, శ్రీనివాసులు, దేవేంద్ర, మండల నాయకులు శ్రీనివాసులు, వీరేష్, తాయన్న, బొజ్జప్ప ఉన్నారు. **ఆస్పరి**లోని సుందరయ్య భవనంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు మల్లేష్, సిపిఎం నాయకులు రామాంజనేయులు, హనుమంతు, రవి, మధు రెడ్డి, వెంకట రాముడు, రంగప్ప పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు, ఆటో యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సిపిఎం నాయకులు కరుణాకర్, నబీ రసూల్, ఆటో యూనియన్ నాయకులు వేణు, బాబు, ఆది, నల్లా రెడ్డి, రాజు, వీరేష్, వీర, జీవన్, నాగరాజు పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని ఓ ప్రయివేట్ లాడ్జిలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు ప్రాణేష్, లక్ష్మన్న, అంజి, కెసి.నర్సప్పచారి, విద్యుత్ శాఖ లైన్‌మేన్ ఇబ్రహీం, నాయకులు అనిల్, దేవపుత్ర పాల్గొన్నారు.

కౌతాళంలో నివాళులర్పిస్తున్న వెంకటేశులు, నాయకులు

దేవనకొండలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న రామాంజనేయులు


ఆదోనిలో...

ఆస్పరిలో

గోనెగండ్లలో

టిడిపి గ్రామ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి - నందవరం

ఈరన్న మునాఫ్ ఎర్రన్న

మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్త టిడిపి గ్రామ కమిటీని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి సోమవారం ఏర్పాటు చేశారు. గ్రామ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఎర్రన్న, ఈరన్న, మునాఫ్ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. నందవరం మండలం హాలహర్వి గ్రామ అధ్యక్షులుగా మద్రి ఎర్రన్న ఎన్నికయ్యారు. నాగలదిన్నె టిడిపి గ్రామ అధ్యక్షులుగా టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న, ఉపాధ్యక్షులుగా ఎన్ఎ.మునాఫ్ ఎన్నికయ్యారు. కుర్ని కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ అధ్యక్షుల ఎన్నికలు నిర్వహించారు. టిడిపి గ్రామ అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులకు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

'మండల కన్వీనర్‌గా ఆదమ్‌ను నియమించాలి'

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

టిడిపి మండల కన్వీనర్‌గా కె.మహ్మద్ ఆదమ్‌ను నియమించాలని ముస్లిం, మైనారిటీలు డిమాండ్ చేశారు. సోమవారం ముస్లిం, మైనార్టీలు హీరోహోండా సాధిక్, కె.మూసా, సయ్యద్ ఉమర్ సాబ్, కండక్టర్ రఫీక్, రావూఫ్ సాబ్, తన్వీర్, ఇర్ఫాన్, కొలిమి సలాం మాట్లాడారు. గత 15 ఏళ్ల నుంచి ఆదమ్ పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్నారని తెలిపారు. పార్టీ అధిష్టానం గుర్తించి మండల కన్వీనర్ పదవిని ఇవ్వాలని కోరారు. సొంత వ్యాపారం, కుటుంబాన్ని వదులుకుని పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని, అందరినీ కలుపుకొని మండల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. గత 20 ఏళ్ల నుంచి ముస్లింలకు టిడిపిలో సముచిత స్థానం లభించలేదని తెలిపారు. అధిష్టానం, ఆలూరు ఇన్‌ఛార్జీ స్పందించి కె.ఆదమ్‌ను మండల కన్వీనర్‌గా ఎన్నుకోవాలని కోరారు.

వైభవంగా ఆంజనేయ విగ్రహ, ధ్వజ, బొడ్రాయి ప్రతిష్టాపన

ప్రజాశక్తి-దేవనకొండ

మండలంలోని నేలతలమర్రి గ్రామంలో గ్రామస్తులు నూతనంగా నిర్మించుకున్న ఆంజనేయస్వామి జీర్ణోద్ధరణ దేవాలయంలో సోమవారం అశేష జనవాహిని మధ్య ఆంజనేయ విగ్రహ, కలశ, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్టాపన చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో హోమం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బంధుమిత్రులతో పండగ వాతావరణం నెలకొంది. పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి నియోజవర్గ మహిళా నాయకులు జ్యోతి, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, నాగరాజు గౌడ్, రాజశేఖర్ గౌడ్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి టిడిపి భరోసా

బాధిత కుటుంబాలకు టిడిపి అండగా ఉంటుందని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు తెలిపారు. ఆయన మండలంలోని నేలతలమర్రి గ్రామానికి విచ్చేసి ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును హరిజన తగరం గోపాల్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తగరం గోపాల్ రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్స ఖర్చులకు రూ.12 లక్షలు అవసరం అవుతుందని ఆయన భార్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు పర్యటనలో కలిసి వినతి పత్రం అందజేశారని తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి కలెక్టర్‌తో మాట్లాడి 24 గంటల్లో ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు చెప్పారు. ఆర్థిక సహాయం చెక్కును టిడిపి ఆలూరు నియోజకవర్గ మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ చేతుల మీదుగా అందించారు. మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, మాజీ జడ్‌పిటిసి ఉచ్చీరప్ప, మాజీ ఎంపిటిసి రామారావు నాయుడు, మాజీ సర్పంచులు నాగరాజు గౌడ్, మల్లికార్జున్ గౌడ్, గిడ్డయ్య గౌడ్, సర్పంచి చిన్న రామప్ప, టిడిపి నాయకులు మల్లెపల్లి రంగడు, ఆస్పరి మాజీ ఎంపిపి కృష్ణ యాదవ్, చిట్టెన్న, రాజశేఖర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిష్టాపనలో పాల్గొన్న టిడిపి ప్రముఖులు

'విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'

ప్రజాశక్తి - మంత్రాలయం

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ ఎస్.రవి హెచ్చరించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావు, శశిశేఖర్, సీనియర్ అసిస్టెంట్ తినోద్, రాజశేఖర్, ఆర్ఐ ఆదాం, విఆర్ఒలు ఆనందం, నరసప్ప, శ్వేత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

డ్రెయిన్ పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

డ్రెయిన్ పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పరిశీలించారు. సోమవారం పట్టణంలోని గూడూరు రోడ్డు దగ్గర గల వంకలో, ఇందిరా నగర్‌లో డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలించారు. డిఇఇ నీరజ, ఎఇ మదన్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే ఏరియా హాస్పిటల్‌ను సందర్శించారు. అలాగే ఇందిరా నగర్, పార్కు రోడ్డు, మార్కెట్ ఏరియాల్లో పారిశుధ్య పనులను నిర్వహించారు. అనంతరం శ్రీనివాస సర్కిల్ అన్న క్యాంటీన్‌లో భోజన పంపిణీ తనిఖీ చేశారు.

పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్